ప్రజాశక్తి
ఆదివారం 14 ఏప్రిల్ 2024 1
అనంతపురం శ్రీ సత్యసాయి







చిలమత్తూరు మండలం లాలెపల్లి గ్రామంలో ఎండలో ఉపాధి పనులుచేస్తున్న కూలీలు

ఉపాధికి వసతుల లేమి..!

- మండుటెండలో పనులు
- కూలీలకు వసతులు కరువు
- పనిప్రదేశంలో కనిపించని టెంట్లు
- ఇంటి నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిల్ నీరే కూలీలకు దిక్కు..!





ఇంటి నుంచి తెచ్చుకుంటున్న వాటర్ బాటిళ్లను ఉంచుకుని భోజనం తింటున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉపాధి హామీ పనులు చేసే చోట కనీస వసతులు కరువయ్యాయి. నీడ, నీళ్ల ఏర్పాటు చేయాల్సి ఉన్నా అటువంటి ఏర్పాట్లేవి మచ్చుకైనా కనిపించడం లేదు. పని చేసే చోట ఉన్న తుమ్మ చెట్టే నీడ, ఇంటి నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లే నీళ్లుగా ఉంటున్నాయి. ఒకవైపు అనంతపురం జిల్లాలో ఎండ వేడిమి 44 డిగ్రీలు నమోదవుతూ ఉంది. ఈ ఎండల్లోనూ కనీస వసతుల్లేకుండా ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. ఉపాధి పనులు చేసే చోట ఎటువంటి ఏర్పాట్లు ఉన్నాయని ప్రజాశక్తి వీటిపై ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పరిశీలన చేసింది. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా మండలాల్లోని పలు గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేసింది. బుక్కరాయసముద్రం మండల కేంద్రం ఆనుకుని మూడున్నర కిలోమీటర్ల దూరంలో సిద్ధరాంపురం చెరువులో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడ సుమారు వంద మంది కూలీలు పనిచేస్తున్నారు. ఇక్కడ ఎక్కడా నీడ ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. చెరువులో ఉన్న తుమ్మచెట్లే వారికి నీడగా ఉంటున్నాయి. ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లతోనే పని ముగించుకుని ఇంటికెళ్లే వరకు సర్దుకోవాల్సి ఉంటోంది. ఇక కూలి గురించి అడిగితే ఇంకా తమకు పని మొదలైందే ఏప్రిల్ ఒకటి తరవాత కాబట్టి ఇంకా బిల్లులు ఎంతన్నది తెలియడం

మిగతా 3లో



కదిరిలో హాజరైన టిడిపి శ్రేణులు (ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న బాలకృష్ణ)

జగన్‌ది నయవంచన పాలన

జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ఐదేళ్ల పాటు నయవంచన పాలన సాగించారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు.

- వచ్చే ఎన్నికల్లో ఓటుతో మట్టికరిపిద్దాం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- కదిరిలో నవ్యాంధ్ర సాకార యాత్ర ప్రారంభం

మిగతా 3లో



డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఇళ్లు కూల్చివేత దుర్మార్గం

- పేదలకు నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను అధికారులు కూల్చి వేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ విమర్శించారు. పేదల ఇళ్ల నిర్మాణాలు, పునాదులను దగ్గరుండచి కూల్చి వేయించిన తహశీల్దార్ విజయ రామరాజు, నగర కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, సిఐ యుగంధర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని

మిగతా 3లో



వి.రాంభూపాల్

పంట నష్టపరిహారం జమచేయండి

సిపిఎం జిల్లాకార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రకటించిన రూ.251 కోట్లు పరిహారాన్ని వెంటనే రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంట నష్టపరిహారంకు సంబంధించి జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్.జగనమోహన్‌రెడ్డి బటన్ నొక్కి నెలన్నర అయినప్పటికీ ఇప్పటివరకు రూపాయి కూడా రైతుల ఖాతాలకు జమ కాలేదన్నారు. రైతులు నష్టపోయిన పంటల విలువతో పోలిస్తే ప్రభుత్వం చెల్లించిందే అతి తక్కువ పరిహారమన్నారు. అది కూడా సకాలంలో చెల్లించకపోవడం రైతులను దగా

మిగతా 3లో

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- ఇవిఎం యంత్రాల ర్యాండమేజైషన్ పూర్తి
- పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ తెలియజేశారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేందకు అవసరమైన అన్ని రకాలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇవిఎం యంత్రాల పరిశీలన, వాటి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించినట్లు వివరించారు. జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ పరిశీలన పూర్తయిందన్నారు. ఆ సమయంలో పార్టీల ప్రతినిధులు అడిగిన అన్నిరకాల సందేహాలనూ నివృత్తి చేసామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటింగ్ యంత్రాలను పార్లమెంటు, అసెంబ్లీ వారీగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామన్నారు. తరలించే సమయంలో వాహనాలకు

మిగతా 3లో

పలువురు కాంగ్రెస్‌లో చేరిక

వజ్రకరూరు : మండలంలోని రాకెట్ల గ్రామ వైసిపి నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వైమధుసూదన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లోకి చేరిన వారిలో ఓబులేసు, రామాంజినేయులు, నాగరాజు, అశోక్, హరిజన ఓబులేసు, హరిజన నాగరాజు, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

గుత్తి : వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గుత్తి ఆర్ఎస్‌లోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలన్నారు. పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు ఉండటం సహజమేనని, వాటిని కార్యకర్తలు మనసులో ఉంచకుండా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకట్రామిరెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువనేత సిబి. మంజునాథరెడ్డి, సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, క్రషర్ మధుసూదన్‌రెడ్డి, బి.రాజ్‌కుమార్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, కౌన్సిలర్లు వి.వరద, ఎస్.ఫారూఖ్, వాల్మీకి శివ, నజీర్, నాయకులు ఎం.రంగస్వామి, బి.రమేష్‌రెడ్డి, సి.మల్లయ్యయాదవ్, గురుప్రసాద్, ప్రవీణ్‌కుమార్, వై.సుభాష్‌రెడ్డి, మైనుద్దీన్, వెల్డింగ్ రోఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శాస్త్ర' విద్యార్థుల విజయ ఢంకా


భరత్‌కుమార్ 980 (ఎంపిసి)


అఖిఫాతాస్లిమ్ 976 (బైపిసి)


రాజశేఖర్‌రెడ్డి 464 (ఎంపిసి)

గుంతకల్లు : ఇంటర్ ఫలితాల్లో శాస్త్ర కళాశాల విద్యార్థులు విజయ ఢంకా మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ బి.చంద్రశేఖర్, ఎ.వెంకటరమణ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో భరత్‌కుమార్ 980, సోనాలి 974, స్వాతి 964, నూర్‌బాషా 964, బైపిసిలో అఖిఫాతాస్లిమ్ 976, దీపిక 969, శ్రేయా 958, రేవతి 957, జూనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో రాజశేఖర్‌రెడ్డి 464, అస్మాహెమరో 460, ఉదయ్‌కుమార్ 457, పుష్పావతి 456, బైపిసిలో భావన 432, విద్యశ్రీ 431, మోహిత 431, శబనాజ్ 431, ఎంఇసిలో జునారియా 464, సిఇసిలో సాదియా 476, నీమత్‌నజీరా 465, ఫాజియానాజ్ 447 మార్కులు సాధించినట్లు తెలిపారు.

'శ్రీశైలం' విద్యార్థుల సత్తా


మెహతాజ్ 466 (సిఇసి)

గుంతకల్లు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీశైల భ్రమరాంబికా జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ సత్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం సిఇసిలో మెహతాజ్ 466 మార్కులు సాధించి టౌన్ టాపర్‌గా నిలిచిందన్నారు. అదేవిధంగా మరికొంత మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. తమ కళాశాలలో అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యాబోధన చేయడంతో తామంతా శ్రద్ధగా చదువుకుని విజయం సాధించామని విద్యార్థులు తెలిపారు.

ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం

నార్పల : మండల కేంద్రంలోని తిక్కస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉట్లమాను పరుష ఉత్సాహంగా సాగింది. ముందుగా తిక్కస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్లమాను పరుషను తిలకించడానికి మండలం నుండే కాకుండా యల్లనూరు, పుట్లూరు, బుక్కరాయసముద్రం, తాడిమర్రి, బత్తలపల్లి, తాడిపత్రి, ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి భారీస్థాయిలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు మొరుసు భాస్కర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పలువురు యువకులు మజ్జిగ, నీరు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో చెక్కభజనలు, కోలాటం, ఇరుసు పందేలు నిర్వహినంచారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉట్లమాను ఉత్సవం ప్రారంభమైంది. యువకులు కేరింతలు కొడుతూ ఉట్లమాను ఎక్కారు.

తాగునీటి సమస్య నిర్మూలనే ఎజెండా : దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్

గత పాలకులు నగరంలో ఏళ్లు గడుస్తున్న మంచినీటి సమస్యని పరిష్కరించలేకపోయారని, టిడిపి అధికారంలోకి రాగానే తాగునీటి సమస్య, పారిశుధ్య నిర్మూలనే ప్రధాన ఏజెండాగా పని చేస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి శనివారం భాగంగా 6వ రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నడిమివంకకు వరదలు వచ్చినప్పుడు ఇళ్లు వరదలకు ముంపునకు గురవుతాయన్నారు. తాము అధికారంలోకి వస్తే సేఫ్టీ వాల్స్ నిర్మిస్తామన్నారు. అలాగే 42వ డివిజన్‌లో వార్డు ఇన్‌చార్జి, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించారు. వీరితోపాటు దగ్గుపాటి సతీమణి శ్రీలక్ష్మీ 44వ డివిజన్ పరిధిలోని 2, 3వ రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువనాయకులు ఓంకార్‌రెడ్డి, రాయల్ మురళి, సంగా తేజస్విని, మున్నానగర్ రమేష్, మాజీ కార్పొరేటర్ జయరామ్‌నాయుడు, జనసేన వీరమహిళ పెండ్యాల శ్రీలత, జనసేన నాయకులు కాయగూరల లక్ష్మీపతి, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, నాయకులు తొండపాటి రమేష్, చమన్‌సాబ్ తనయుడు డాక్టర్ ఉమర్, సుధాకర్‌యాదవ్, విశాలాక్షి, బాబా ఫక్రుద్దీన్, రాజారావు, వడ్డే భవానీ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే ఇంటింటా సంక్షేమం : వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైసిపి నాయకులు

సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వ ద్వారానే ఇంటింటికీ సంక్షేమ సాధ్యమని ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థి వీరాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని మడ్డిపల్లి, నారాయణరెడ్డిపల్లి, సూరేపల్లి, గొల్లపల్లి, అరకటవేముల, కొండాపురం గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనను గెలిపిస్తే మీ సేవకుడిగా పనిచేస్తూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కోరారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మరోసారి మోసం చేసేందుకు టిడిపి నాయకులు వస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపిపి రాఘవరెడ్డి, మడ్డిపల్లి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రామానుజన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాకార యాత్రను జయప్రదం చేయాలి

శింగనమల : నియోజకవర్గంలో సినీనటుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర సహకార యాత్రను విజయవంతం చేయాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కావున నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి కుటుంబ సభ్యులు, మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరనానాయుడు, నాయకులు గుర్రప్పనాయుడు, పిఎల్ ఈశ్వర్‌రెడ్డి, డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, చితంబరిదొర, గుత్తా ఆదినారాయణ, చిదానందనాయుడు, విశాలాక్షి, అమ్మలదిన్నె శాలిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా : ప్రకాష్‌రెడ్డి


గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు : ప్రజలకు చేసే భాగ్యం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి శనివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడంతో ఏళ్లనాటి కల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. గత ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేశారన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు మండలంలో 25, అనంతపురం రూరల్ మండలంలో 31, కనగానపల్లి మండలంలో 27, రామగిరి మండలంలో 27 గ్రామాలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.117 కోట్లతో పైపులైను పనులు చేపట్టారు. కావున వచ్చే ఎన్నికల్లో మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, గంగుల భానుమతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నార్పల : మండల కేంద్రంలోని శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, బాబాఫకృద్దీన్, బాబానజీర్, బాబాసలాం, గంగాధర్, గిరీష్, యశ్వంత్, నబి, ఖాశీం, ఇస్మాయిల్, పెద్దన్న, నాగరాజు, దాదావలి, విజయ్, శీనా తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

రూ.22 లక్షల నగదు సీజ్

తాడిపత్రి : ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.22 లక్షలను సీజ్ చేసినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ గౌస్‌బాషా, తాడిపత్రి అసెంబ్లీ ఎన్నికల ఎస్‌టి టీం ఇన్‌ఛార్జి రామాంజనేయరెడ్డిలతో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణంలోని చుక్కలూరు రోడ్డులో ఉన్న బ్రిడ్జి వద్ద స్థానిక కృష్ణాపురం రెండవ రోడ్డుకు చెందిన షేక్‌సాదిక్, షేక్ మునీర్‌బాషా మోటారు సైకిల్‌లో అనుమానంగా వెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వీరు ద్విచక్ర వాహనంలో రూ.22 లక్షలు తరలిస్తుండగా గమనించారన్నారు. అయితే నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా వీరిపై విచారించగా ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు బెంగుళూరు, తదితర ప్రాంతాల్లో బంగారం కొనుగోలు చేసి తాడిపత్రిలో అధిక ధరకు విక్రయిస్తుంటారని తేలిందన్నారు. కాగా ప్రస్తుతం పట్టుబడిన డబ్బుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల ఆర్ఓ ద్వారా ఐటి విభాగానికి అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

15న జిఆర్‌టి జ్యువెల్లరీ మార్ట్ ప్రారంభం



అనంతపురం : నగరంలోని రాజు రోడ్డులో ఉన్న మాసినేని గ్రాండ్ పక్కన నూతనంగా నిర్మించిన భవనంలో జిఆర్‌టి జ్యువెలరీ మార్ట్‌ను ఈనెల 15న ప్రారంభించనున్నట్లు ప్రతినిధి మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమలో మొట్టమొదటి బ్రాంచిను అనంతపురంలో ప్రారంభించడం సంతోషగా ఉందన్నారు. ప్రారంభోత్సవానికి జిఆర్‌డి మార్ట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హాజరవుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రెండు ఫ్లోర్లలో బంగారు, వెండి, ప్లాటినం, వజ్రాలు లభిస్తాయి తెలిపారు.

'కూటమి'కి ఓటుతో బుద్ధి చెప్పాలి : విశ్వ

ప్రజాశక్తి-వజ్రకరూరు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

పెత్తందారులంతా ఒకటై ఏర్పడిన కూటమి అభ్యర్థులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకులు, చిత్తూరు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్‌తో కలిసి శనివారం కూడేరు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు, గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యంతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనంతా మోసం, అబద్ధాలు, కుట్రలే తప్ప చేసిందేమీ లేవన్నారు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నానని, సీనియర్ అని చెప్పుకుంటున్న ఆయన ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో అనేక హామిలిచ్చి గెలిచాక ఏఒక్క హామీనైనా నెరవేర్చలేదని విమర్శించారు. ఇక ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలను గాలికొదిలేసిన పయ్యావుల కేశవ్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదన్నారు. ఆయనకు ప్రజలు అవసరం లేదని కేవలం పదవి మాత్రమే కావాలని చెప్పారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది నయవంచన పాలన

నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన స్వర్ణాంధ్ర సాకారయాత్ర శనివారం నాడు కదిరిలో అట్టహాసంగా ప్రారంభమైంది. జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ఐదేళ్ల పాటు నయవంచన పాలన సాగించారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన స్వర్ణాంధ్ర సాకారయాత్ర శనివారం నాడు కదిరిలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో కదిరికి చేరుకున్నారు. అక్కడ ఉమ్మడి జిల్లా టిడిపి నాయకులు బాలయ్యకు స్వాగతం పలికారు. ముందుగా కదిరి శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అక్కడి నుంచి బయలుదేరి ఆలంఖాన్ వలీ దర్గాను సందర్శించి ముస్లిం సోదరులుతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి పివిఆర్ గ్రాండ్‌లో గిరిజనులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం పివిఆర్ గ్రాండ్ నుంచి రోడ్ షో నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జీవిమాన్ సర్కిల్లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సొంత చిన్నాన్నను హత్య చేసిన నిందితులను జగన్మోహన్‌రెడ్డి కాపాడుతూ వారికి వత్తాసు పలుకుతున్నారని తెలియజేశారు. సొంత తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెట్టేసిన ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఐదేళ్ల గా జనాల రక్తాన్ని జలగల్లా వైసిపి నాయకులు పీల్చేస్తున్నారని విమర్శించారు. ఒక్క ఛాన్స్‌తో అన్ని వర్గాలను నిండా ముంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మళ్ళీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. మావయ్య అంటూ మనోభావాలు తగలబెట్టేశాడన్నారు. నవరత్నాలు అంటూ నవనాడాలను కుంగతీశాడని ఎద్దేవా చేశారు. జగన్ పాలన అంతా దగా, మోసంతో కొనసాగిందన్నారు. ఇలాంటి వ్యక్తికి పాలించే హక్కు లేదన్నారు. జగన్ అహంకారం కరిగిపోయే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. గతంలో టిడిపి హయాంలో రాయలసీమను రాయల్‌సీమకు మార్చామన్నారు. కృష్ణ జలాలను తీసుకుని పొలాలను సశ్యశ్యామలం చేశామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాయలసీమను కక్షలతో నింపారన్నారు. ముస్లిం, మైనార్టీలకు అండగా నిలబడే పార్టీ తెలుగుదేశం అన్నారు. టీడీపీ హయాంలో ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలన్నింటినీ రద్దు చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపి, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని పునరుద్ఘాటించారు. ప్రజలంతా ఏకమై జగన్‌ను ఇంటికి పంపాలన్నారు. రాష్ట్రంలో నిరాశ, నిస్పృహలను పారదోలి అభివృద్ధి పథంలో దూసుకెళ్లేందుకు వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కదిరి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్, హిందూపురం ఎంపీగా బికె.పార్థసారధిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

కదిరిని అభివృద్ధి చేస్తాం

టిడిపి అధికారంలోకి రాగానే కదిరి కదిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని బాలకృష్ణ తెలియజేశారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరి తాగునీరు అందిస్తామన్నారు. కదిరి పట్టణంలో అండర్ డ్రైయినేజీని ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని ప్రాంతాలనూ కలిపేలా రింగురోడ్డును పూర్తి చేస్తామని తెలియజేశారు. ఎన్పీకుంట, గాండ్లపెంట మండలాలకు హంద్రీనీవా సాగునీరు అందిస్తామన్నారు. కదిరి పట్టణంలో కస్తూరిబా పాఠశాలను పూర్తి చేస్తామని, శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామనే హామీలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, హిందూపురం ఎంపీ అభ్యర్థి బికె.పార్థసారథితో పాటు జిల్లాలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని

5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పాఠశాలకు సక్రమంగా వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం పట్టణంలోని వైఎస్ఆర్‌కె కాలనీలో చోటు చేసుకుంది. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఆర్టీసీ డిపోలో డ్రైవర్గా పనిచేస్తున్న రంగప్ప, శ్రీదేవి దంపతుల కుమారుడు నాగచైతన్య (11) ఉన్నాడు. ఓ ప్రైవేటు పాఠశాలలో బాలుడు 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు నాగచైతన్యను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నాగచైతన్య శనివారం ఇంట్లో ఫాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఉరేసుకుని వ్యక్తి...

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన ఓ కూలి ఉరేసుకుని శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...కేతిరెడ్డి కాలనీకి చెందిన ఉద్దండి నాగేంద్ర(43) కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేవాడు. మద్యంమత్తులో ఈయన తరచూ కుటుంబసభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆరునెలల క్రితం భార్య రామసుబ్బమ్మ అతన్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. గత 20 రోజులక్రితం కుమారుడిపై కూడా నాగేంద్ర దాడిచేసి గాయపరిచాడు. ఈ నేపథ్యంలో నాగేంద్ర వ్యక్తిత్వ ధోరణి నచ్చక కుటుంబసభ్యులు అతన్ని పూర్తిగా దూరం పెట్టారు. నాగేంద్ర ఒక్కడే ఒంటరిగా ఉండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ఒంటరి తనం భరించలేక మనస్తాపంతో శనివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మృతుని తల్లి, కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ప్రశాంతి నిలయంలో తమిళ నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో తమిళ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం సాయి కుల్వంత్ సభా మండపంలో కేరళ నుంచి పుట్టపర్తి విచ్చేసిన సాయి భక్తులు వారి సాంప్రదాయ పద్ధతులలో ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలను ఆలపించారు. ప్రశాంతి నిలయంలో ఈ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం కేరళ సాంప్రదాయ వాయిద్యాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఉపాధికి వసతుల లేమి..!

కూలీ తెలిపింది. నీళ్లు, నీడ గురించి అడుగగా అది రెండేళ్ల క్రితం ఉండేదని శ్రీకాంత్ అనే మేట్ చెప్పాడు. రెండేళ్ల క్రితం మజ్జిగ ఇచ్చేవారని, ఇప్పుడు అవేవి లేవని తెలిపాడు. ప్రభుత్వం రూ.270 నుంచి రూ.300కు కూలి పెంచామని చెబుతున్నా ఇంకా ఆచరణలోకి రాలేదన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం లాలేపల్లి చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ఎలాంటి మౌలిక సదుపాయాలూ కల్పించలేదన్నారు. ఎండలోనే కూలీలు పనులు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

అనంతపురం జిల్లాలో 577 గ్రామపంచాయతీలున్నాయి. వీటి పరిధిలో మొత్తం3.02 లక్షల జాబ్‌కార్డులున్నాయి. అన్నింటిలోనూ కలిపి 5.5 లక్షల మంది ఉపాధి కూలీలు నమోదై ఉన్నారు. ఇందులో 4.37 లక్షల మంది యాక్టివ్ వర్కర్లు ఉన్నారు. ఏప్రిల్ ఒకటవ తేది నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా 66 గ్రామ పంచాయతీల పరిధిలో మాత్రం పనులు ప్రారంభమవ్వాల్సి ఉంది. తక్కిన చోట్ల ప్రారంభమయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 2023-24 మార్చి నాటికి 1,49,273 మంది కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించారు. వంద రోజులు పనులుపూర్తి చేసుకున్న కుటుంబాలు 21003 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,66,520 జాబ్‌కార్డులు ఉన్నాయి. 2023-24 మార్చి నాటికి 27,203 లక్షల నిధులను ఉపాధికి ఖర్చు అయ్యాయి. 2024 మార్చి 15వ తేదీ వరకు ఉపాధి బిల్లులు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఇక రెండు జిల్లాల్లోనూ ఉపాధి పనులు జరుగుతున్న చోట ఎక్కడా కనీస వసతుల కల్పన లేదు. జిల్లాలో తీవ్రమైన ఎండ వేడిమి ఉన్నా ఎటువంటి ఏర్పాట్లు లేవు. వడదెబ్బ తగిలితే అందించే వైద్య కిట్లు కూడా అందుబాటులో లేవు.

మొదటి వారం నుంచి పనులు మొదలయ్యాయి

రవి ఫీల్డ్ అసిస్టెంట్, బుక్కరాసముద్రం.

ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తరవాత ఏప్రిల్ మొదటి నుంచి పనులు ప్రారంభం అయ్యాయి. పనులు చేసేందుకు కూలీలు కూడా బాగానే వస్తున్నారు. కొత్త వేతనం రూ.300 ఇంకా ఆదేశాలు రాలేదు. ఇప్పటి వరకు ముందున్న రూ.270 ప్రకారమే బిల్లులు జరుగుతున్నాయి. పై నుంచి ఆదేశాలొస్తే ఆ ప్రకారం చేస్తాం.

పంట నష్టపరిహారం జమచేయండి

చేయడమే అవుతుందన్నారు. గత సంవత్సరం వర్షాలు లేకపోవడంతో పాటు ఈ రబీలో ఎండలు ఎక్కువై భూగర్భ నీటి మట్టం తగ్గిందన్నారు. పండ్ల తోటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వందల ఎకరాల్లో అరటి, చీనీ తోటలు ఎండిపోతున్నాయని తెలిపారు. ఎన్నికల హడావుడిలో రైతులను వారు ఎదుర్కొన్న కష్టాల గురించి పట్టించుకునే పరిస్థితిల్లో అధికార యంత్రాంగం లేదన్నారు. పంట నష్టపరిహారంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ కలిపి చెల్లిస్తే తప్పా రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తాం

జిపిఎస్ ఏర్పాటు చేసి వాహనాలను ట్రాక్ చేస్తామన్నారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల యంత్రాల తరలింపు పూర్తవుతోందన్నారు. వచ్చే వారంలోపు అసెంబ్లీ నియోజకవర్గాల యంత్రాల తరలింపు పూర్తవుతుందన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ పూర్తయిందన్నారు. ఇంకా అవసరమైతే మరో దఫా శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది పూర్తి స్థాయిలో ఉన్నారా అన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఇప్పటి వరకు పిఒ, ఎపిఒల వరకు ఇబ్బంది లేదని, ఒపిఒల కొరత ఉందని చెప్పారు. దీనికి ఉన్న వివిధ శాఖల్లోని సిబ్బంది గుర్తించామని చెప్పారు. వారిని వినియోగించుకునే అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసామన్నారు. వారి నుంచి ఉత్తర్వులు వస్తే ఆ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణకు పూర్తి స్థాయిలో సన్నద్ధమై ఉన్నామన్నారు. ఎక్కడైనా సమస్యలొచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు

జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలియజేశారు. ఇందు కోసం ప్రత్యేకంగా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతానికి జిల్లాలో నీటి సమస్యలేదని జులై రెండవ వారం వరకు అవసరమైన నీరు అందుబాటులో ఉందని చెప్పారు. ఎక్కడైనా నిర్వహణలో మరమ్మతులు ఇతర కారణాలతో సమస్య వస్తే వెంటనే పరిష్కరించి నీటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకునే విధంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేత దుర్మార్గం

డిమాండ్ చేశారు. ఈ మేరకు పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బాబీజాన్ సైదాను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అధికారులు అర్హులుగా గుర్తించినప్పటికీ సకాలంలో ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పేదలందరూ పెనుకొండ నగర పంచాయతీ రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 668లోని ప్రభుత్వ భూమిని గుర్తించి గత సంవత్సర కాలం నుంచి ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారన్నారు. పేదలు అక్కడే నివాసం ఉంటున్నారని తెలియజేశారు. ఇళ్ల స్థలాల పట్టాల కోసం పేదలు హైకోర్టు ను ఆశ్రయించారన్నారు. హైకోర్టు పేదలకు పట్టాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించిందని తెలియజేశారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు శుక్రవారం సాయంత్రం పేదల నిర్మాణాలను జెసిబిలో కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తహశీల్దార్ విజయరామరాజు, నగర కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, సిఐ యుగంధర్ దగ్గరుంచి వారి సిబ్బందితో కూల్చివేతలు చేశారన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే దౌర్జన్యంగా కూల్చివేశారన్నారు. ఇళ్లు, పునాదులను నేలమట్టం చేశారన్నారు. సుమారు రూ.25 లక్షల వరకు పేదలకు నష్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా పేదల నిర్మాణాలను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు నష్ట పరిహారాన్ని పూర్తి స్థాయిలో అందించాలన్నారు. స్పందించిన డీఎస్పీ కోర్టు ఆదేశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు వర్షిని, నాగమణి, తిప్పన్న , హబీబ్, షబానా, సౌమ్య, శిల్ప, మంజుల, లలిత, గంగయ్య, పాల్గొన్నారు.

సెకండ్ ఇంటర్‌లో సాయినితిన్ అత్యుత్తమ ప్రతిభ



చెన్నేకొత్తపల్లి : మండలంలోని న్యామద్దెల గ్రామానికి చెందిన సుజాత, రామ్మూర్తి దంపతుల కుమారుడు సాయినితిన్ ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 990/1000 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. సాయినితిన్ కర్నూలు జిల్లాలోని డోన్ సాయిసుధా జూనియర్ కాలేజీలో చదువుతున్నాడు. అత్యుత్తమ మార్కులు సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు, బంధువులు, ు స్నేహితులు అభినందించారు

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొక్కంటివారి పల్లి గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, పూలు తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. చెన్నకేశవస్వామి పూజా సామగ్రిని కొక్కంటి వారిపల్లి గ్రామంలోని వీధుల్లో ఉరుములు, వాయిద్యాల మధ్య ఎలవగంప కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి యోగివేమన బ్రహ్మోత్సవాలు

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లిలో ఆదివారం నుంచి శ్రీయోగివేమన బ్రహ్మోత్సవాలను 3 రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు శనివారం ఆలయ పూజారులు తెలిపారు. వారు మాట్లాడుతూ 14వ తేదీ మహాశక్తి పూజ, కుంభం పోయుట, 15న ఆలయ వద్ద చాందినీ బండ్లు మెరువన పానక పందేరం, అదేరోజు ఆర్కెస్ట్రా, భక్తిపాటలు, 16న ఉట్ల తిరుణాల నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, వైద్యం, తదితర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారని వారు తెలిపారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

మడకశిర : మండలంలోని గౌడనహల్లి గ్రామ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడిన ఘటనలో 8 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సీనియర్ నాయకులు ఆసుపత్రికి వెళ్లి గయపడిన వారిని పరామర్శించారు.

ఆర్టీసీ డిఎం సమక్షంలో లక్కీడ్రా

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం-ఉరవకొండ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయా ణికుల టికెట్లను శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. పట్టణం లోని రాణిసత్రం బస్టాండ్ వద్ద రాయదుర్గం-ఉరవకొండ రూట్‌లో తిరుగుతున్న బస్సుల్లో ఉంచిన లక్కీ డిప్ పెట్టెల్లో ఆ బస్సులో ప్రయాణించిన ప్రయా ణికులు తమ టిక్కెట్ వెనుక వారి పేరు, ఫోన్ నెంబర్ రాసి వేసిన టిక్కెట్లను ప్రయాణికుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. అందులో ముగ్గురు ప్రయాణికులను ఎంపిక చేశారు. వారి వివ రాలు.. మున్నీ-8639839003(కణేకల్లు), జె.జగన్నాథరెడ్డి-80732 31052(గ్రామదట్ల), సి.పాండు వరప్రసాద్-94909 78091(పాల్తురు)ఎంపికయ్యారు. వీరు ఎపిఎస్ ఆర్టీసీ రాయదుర్గం డిపో ఆఫీసులో పని వేళల్లో వచ్చి బహుమ తులను తీసుకెళ్లాలని డిఎం సూచిం చారు. ప్రయాణికులు ఎప్పటిలాగే ఎపిఎస్ ఆర్టీసీని ఆదరించాలని డిఎం కోరారు.



లక్కీడ్రా తీస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సురేష్

వైసిపి ప్రభుత్వం కూలిపోయే సమయం ఆసన్నమైంది

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

ఐదేళ్ల పాటు అబద్ధాలు, దోపిడీ లు, భూకబ్జాలు, సెటిల్మెంట్లతో కాలం గడిపిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి పరి టాల సునీత ప్రజలను కోరారు. ప్రాజెక్టులు నిర్మిస్తామంటూ వైసిపి ప్రభుత్వంలో వేసిన శిలాఫలకాలు కూలిపోయాయి... ఇప్పుడు వైసిపి ప్రభుత్వం కూడా కూలిపోతుందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె మండలంలోని వెంకటాం పల్లి, ఒంటికొండ, చిన్నమొగలైపల్లి, పెద్దమొగలైపల్లి గ్రామాల్లో పర్యటించారు. పార్టీ శ్రేణులు ఆమెపై పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లడంతో పాటు రోడ్ షో నిర్వహించారు. టిడిపి హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ను ప్రజలకు వివరించారు. ఈ ఐదేళ్లలో వైసిపి ఏం చేసిందో చెప్పాలన్నారు. పేరూ రు ప్రాజెక్టుకు నీరందించేందుకు నేను రూ. 800 కోట్లు తీసుకొచ్చి పనులు ప్రారంభిస్తే.. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక దానిని పూర్తిగా మార్చేశారన్నారు. రిజర్వా యర్లను మార్చేసి జగన్‌తో ఆర్భాటంగా శంకుస్థాపన చేయించారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎక్కడా తట్టెడు మట్టి కూడా తీయలేద న్నారు. రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో రోడ్ల గురించి పట్టించుకోలేదన్నారు. చెన్నేకొత్త పల్లి వయా వెంకటాంపల్లి, ఒంటికొండ, ఓబుళంపల్లి మీదుగా ధర్మవరం-పుట్టపర్తి లింక్ రోడ్డు వరకూ ఉన్న సింగాల్ రోడ్డును తవ్వి ఇప్పటివరకు వేయలేదన్నారు. వారిపై నమ్మకంతో వారి వెంట నడిచిన కార్యకర్తలు, నాయకులకు కూడా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు ద్రోహం చేశారని సునీత పేర్కొన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మీకు శాశ్వతంగా రాజకీయ సమాధి తప్పదన్నారు. ప్రచారంలో వెంకటంపల్లి చిన్న ముత్యాలరెడ్డి, బోయ లింగమయ్య, రమణారెడ్డి, కన్వీనర్ ముత్యాలరెడ్డి, చిన్నపల్లి బాలరాజు, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు..



పరిటాల సునీతకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు



కాలవను కలిసిన చిలకం

కాలవతో చిలకం భేటీ

ప్రజాశక్తి-రాయదుర్గం

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి శనివారం పట్టణంలో నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకం కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులును, జనసేన నియోజ కవర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడను కలిశారు. కాలవ విజయానికి కృషి చేస్తామని చిలకం భరోసా ఇచ్చారు. అనంతరం జనసేన పార్టీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థి కాలవను గెలిపించుకోవాలనే విషయాలపై చర్చించి వారికి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి మారేశ్, రాప్తాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పేరూరు శ్రీనివాసులు, కోటికి రామాంజి, చిలకం సుధాకర్‌రెడ్డి, టిడిపి యువ నేత పాటిల్ అజయ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలు రైతు మేనిఫెస్టో విడుదల చేయాలి

రైతు రక్షణ వేదిక కన్వీనర్ గౌని ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక కన్వీ నర్ గౌని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. వాల్మీకి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నూరుస్వామి ఆహ్వానం మేరకు శనివారం ఆయన డి.హీరేహాల్‌లో రైతులను కలిశారు. స్థానిక రైతులు మాట్లాడుతూ డి.హీరేహాల్ మండలంలోని ఇనుము, ఉక్కు పరిశ్రమల వల్ల పొలాలు దుమ్ము, ధూళితో కలుషితం అవుతున్నాయని, పంట సాగుకు వీలులేకుండా పోతున్నాయని వాపోయారు. హీరేహాల్, సిద్ధాపురం గ్రామాల కోసం ఓ చెరువు నిర్మించాలని 15 ఏళ్లుగా కోరుతున్నా ఏ రాజకీయ పార్టీ, నాయకుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గౌని ప్రతాపరెడ్డి మాటాలడుతూ రైతులు సంఘటితంగా పోరాడితే రాజకీయ పార్టీలు స్పందిస్తాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రైతులు విరివిగా నామినేషన్ వేయాలని కోరారు. ప్రధాన రాజకీయ పార్టీలు రైతాంగం కోసం ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటించకపోతే రాయదుర్గం రైతు రక్షణ వేదిక తరపున వందలాది నామినేషన్లు వేస్తామని ఆయన హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌని ప్రతాపరెడ్డి

వైసిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి అనంతరాజుకు సన్మానం

మడకశిర : నియోజకవర్గ వైసిపి అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా రొళ్ల జడ్పిటిసి అనంతరాజు నియమితుల య్యారు. దీంతో ఆయనను శనివారం పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ ధను, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మంజునాథ ఘనంగా సన్మానించారు. అలాగే వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి. శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. సమిష్టిగా పని చేసి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.



అనంతరాజును సన్మానిస్తున్న వైసిపి నాయకులు



కోఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి సునీల్ కుమార్

సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సైనికుల్లా పనిచేయాలి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్


ప్రజాశక్తి-మడకశిర

టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రతిక్షణం ప్రజలకు అందేలా చూడాలన్నారు. మీరు ఎంత కష్టపడితే పార్టీకి అంత మేలు జరుగుతుందని తెలిపారు. మనందరం కలిసికట్టుగా టిడిపి గెలుపు కోసం పని చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుని సిఎం చేసుకోవడమే మనందరి ధ్యేయం అన్నారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్లందరూ సంతోషం వ్యక్తం చేస్తూ టిడిపి గెలుపు కోసం అహర్నిశలు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : సవితమ్మ

ప్రజాశక్తి-గోరంట్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె శనివారం మండలంలోని మందలపల్లి, కరావులపల్లి, తండా, ఖాజాపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆమె ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సిఎం జగన్ అండ్ కో దోచుకోవడం తప్ప ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణు జయరాం, శ్రీనివాసులు, విద్యాధరణి, యువశేఖర్, విజయ్, శేఖర్‌బాబు, కన్నారెడ్డి, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సవితమ్మ

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు తిప్పలు

ప్రజాశక్తి-నల్లమాడ

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. దీంతో ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లమాడ మార్గంలో నేటికీ ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన బస్సులనే నడుపుతుండడంతో అవి వేళకు గమ్యస్థానానికి చేరుకుంటాయో లేదో అని ప్రయాణికులు, ఉద్యోగులు ఈ బస్సులు ఎక్కాలంటే జంకుతున్నారు. పుట్టపర్తి, ధర్మవరం, హిందూపూరం, పెనుకొండ, కదిరి డిపోల నుంచి సుమారు 400 బస్సులు ప్రతిరోజపూ రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో అధిక శాతం కాలం చెల్లిన బస్సులే కాగా వాటికి రంగులు వేసి నడుపుతు న్నారు. బస్సులో కూర్చుంటే డబడబమని శబ్దం, బ్రేకులు ఊడిపోవడం, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వేళకు గమ్యం చేరుతామో లేదో అనేది సందేహమే. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ఈ బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు ఆలోచిస్తున్నారు. విధిలేని పరిస్థితిలో ఆర్టీసీ బస్సులు ఎక్కితే అవి ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడం, దీంతో ప్రయాణికులు కిందకు దిగి తోసిన సందర్భాలెన్నో ఉన్నాయి. నల్లమాడ, పుట్టపర్తి, కొత్తచెరువు మార్గంలో కాలం చెల్లిన బస్సులు నిత్యం ఎక్కడో ఒక చోట మొరాయిస్తూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆయా డిపోలకు ఐదేళ్లుగా కొత్త బస్సు కేటాయించకపోవడంతో అధికారులు ఉన్న బస్సులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడిపి ప్రయాణికులను సకాలంలో గమ్యాలకు చేర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కదిరి-కొత్తచెరువు ఆర్టీసీ బస్సు మార్గమధ్యలో ఆగిపోగా తోస్తున్న ప్రయాణికులు(ఫైల్‌ఫొటో)



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బికె.సాయి కళ్యాణ్

మృతుల కుటుంబాలకు బికె.సాయికళ్యాణ్ పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కె.మరువపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చాకలి క్రిష్టప్ప శనివారం అనా రోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే హిందూపురం టిడిపి ఎంపి అభ్యర్థి బికె.పార్థ సారథి కుమారుడు బికె.సాయి కళ్యాణ్ ఆ గ్రామం వెళ్లి క్రిష్టప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి టిడిపి అండగా ఉంటుందని భరో సా ఇచ్చారు. అదే గ్రామంలో చాకలి నందిని ఆత్మహత్యకు పాల్పడగా వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయి కళ్యాణ్ వెంట డొడగట్టప్ప, గొర్రప్ప, అరుణ్‌రెడ్డి, ఈడిగ శీన, శివప్ప, అంజి, ఆది, ముత్తప్ప, మల్లికార్జున, కేశప్ప ఉన్నారు.

ఏలంజిలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఏలంజి గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. దీంతో విధి లేని పరిస్థితిలో ఎండలోనే కిలోమీటర్ల మేర కాలినడకన గ్రామ సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకొంటు న్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో 500 కుటుం బాలు జీవనం సాగిస్తున్నాయని, గ్రామ అవసరాల కోసం వేదవతి నదిలో వేసిన బోరు బావిలో నీటిమట్టం తగ్గిపోవడంతో గ్రామంలో నీటి సమస్య తలెత్తిందన్నారు. దీంతో గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్లకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామన్నారు. ఏలంజి గ్రామం మండల కేంద్రమైన బొమ్మనహాల్‌కు 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీంతో ఓ ఒక్క అధికారి అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామంలో సమస్యలు నెలకొన్నాయని, ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చిందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ విజయమ్మ వివరణ కోరగా మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య లేదని దాటవేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చేతన్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా వేదవతి నదిలో ఒక బోరు వేశాము. అందులో నీటిమట్టం తగ్గి ఉండొచ్చు అన్నారు.



వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-గోరంట్ల

ప్రతి విద్యార్థి కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెదరాసు సుబ్రమణ్యం సూచించారు. పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల లో శనివారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యా ర్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను చక్కగా విని ఆ తర్వాత బాగా చదివి పోటీ పరీక్షల్లో నెగ్గి ర్యాంకులు సాధిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని తెలిపారు. ఉన్నత స్థాయిలో స్థిరపడితే పది మందికి సహాయపడవచ్చు, తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు నందగోపాల్, హరీష్, బాలమోహన్, కవిత, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు



డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం

రేషన్ డీలర్ల చేతివాటం

ప్రజాశక్తి-పుట్టపర్తి

కొత్తచెరువు మండలంలోని మరకుంటపల్లిలో ప్రభుత్వం అందించే నిత్యావసర సరకుల్లో చౌక ధాన్యం డిపో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కిలో ప్యాకెట్ రాగి పిండి తీసుకుంటే కిలో బియ్యం తగ్గించి అదనంగా రూ. 11 తీసుకోవాల్సి ఉండగా లబ్ధిదారులతో అదనంగా రూ. 15 వసూలు చేస్తు న్నారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదని రేషన్ కార్డుదారులు వాపోతు న్నారు. రాగి పిండి, చక్కెర, కందిబేడలపై కూడా అదనంగా వసూలు చేయడంతో పాటు బియ్యం తూకాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే రేషన్ డీలర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారని రేషన్ కార్డుదారులు పేర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భారీగా కర్నాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం-గొల్లపల్లి రహదారిలో రైల్వే గేట్‌కి సమీపంలో శనివారం ఓ వ్యక్తి నుంచి పెద్ద ఎత్తున కర్నాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సిఐ మురళీమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రహదారికి సమీపంలో కొండగట్టు వద్ద ఓ వ్యక్తి టార్పాలిన్ కప్పి ఆ ప్రాంతంలో అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా తనిఖీ చేశారు. టార్పాలిన్ కింద 16 అట్టపెట్టెల్లో కర్నాటక రాష్ట్రానికి చెందిన 1,536 మద్యం ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు. చెరువుదొడ్డి గ్రామానికి చెందిన శివన్న రాయదుర్గానికి చెందిన ప్రసాద్, రవి సహకారంతో కర్నాటక నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తెచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంద న్నారు. నిందితుడి వద్ద మద్యం ప్యాకెట్లు, రవాణాకు ఉపయోగించిన ద్వి చక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ తెలిపారు. దాడుల్లో తనతో పాటు సెబ్ ఎస్ఐ శ్రీధర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భాస్కర్ పాల్గొన్నట్లు సెబ్ సిఐ తెలిపారు.



సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు, బైక్

నేడు టిడిపి బెంగళూరు ఫోరం ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి బెంగళూరు ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నటు పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి కెఎన్.పల్లి సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, ఎంపి బికె.పార్థసారథి, బివి వెంకటరాముడు, పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, బెంగళూరులో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు, సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రం బాగుండాలి అంటే టిడిపి అధికారంలో ఉండాలని మండల నాయకులు పేర్కొన్నారు. వారు శనివారం మండలంలోని కంబాలపల్లి పంచాయతీ, బీదనపల్లి, శ్యామపు రం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సవితమ్మను, హిందూపురం ఎంపిగా బికె.పార్థ సారధిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, సుబ్బరత్నమ్మ, నరసింహులు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, మాధవనాయుడు, జివిపి నాయుడు, సర్పంచి మంజు, మనోహర్, నాగేంద్ర, సురేష్, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి మాజీ పాత్రికేయుడు శివానంద మృతి

ప్రజాశక్తి-అమరాపురం

సీనియర్ పాత్రికేయుడు శివానంద అనారోగ్య కారణాల వల్ల శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. శివానంద ఏడాదిగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. ఇతడు గతంలో ప్రజాశక్తి దినపత్రికలో సేవాభావం, అంకితభావంతో నిస్వార్థంగా పని చేశారు. అనారోగ్య కారణాల వల్ల ఏడాదిగా పాత్రికేయ వృత్తికి దూరమయ్యాడు. ఈయన మృతితో స్వగ్రామమైన మండలంలోని దేవగనపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ వేర్వేరుగా ఆ గ్రామం వెళ్లి శివానంద మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే ఆయన మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రాగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించా రు. శివానంద మృతి పట్ల మండల కన్వీనర్ గణేష్, నాయకులు కృష్ణమూర్తి, ఉగ్ర నరసింహప్ప, నరసింహమూర్తి, దాదు, శివరుద్రప్ప, మద్దనకుంట రఘునాథ్, ఒక్కలిగ సంఘం రాష్ట్ర డైరెక్టర్ హనుమంతరాయ, జయరామప్ప, ఒక్కలిగ సాధికార సంఘం అధ్యక్షులు వీరకేతరాయప్ప, రూపారాధాకష్ణ, దాదాపీర, రామిరెడ్డి, కెంచప్ప, ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జి తిమ్మప్ప, పాత్రికేయులు లోకేష్, మడకశిర రూరల్ నాగరాజు, గుడిబండ నాగరాజు, జయకుమార్, తదితరులు నివాళులర్పించారు.



శివానంద

నేడు టిడిపి ఐటి నిపుణుల ర్యాలీ

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో ఆదివారం బెంగళూరు టిడిపి ఫోరం ఐటి నిపుణుల ఆధ్వర్యంలో చేపట్టే ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, అబ్జర్వర్ నరసింహారావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఐటి రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. తద్వారా పల్లెల్లోని రైతుబిడ్డలు నేడు ఐటి రంగంలో ఉద్యోగాలు పొంది స్థిర పడ్డారన్నారు. ఐటి నిపుణులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ చేపడతారని, ఆ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. వారితో పాటు మండల కన్వీనర్ సోమశేఖర్, టౌన్ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణచౌదరి, రాజారెడ్డి, వేణు, జయరాం, జనసేన పార్టీ నాయకులు, బెంగళూరు ఐటి రంగం టిడిపి ఫోరం సభ్యులు పాల్గొన్నారు



రీటా నేర్పిన పాఠం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు

నీలిమ మైత్రా ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆల్ ఇండియా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నీలిమ మైత్రా ఆశయాలు కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి అన్నారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో 12నన మృతిచెందిన అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నీలిమ మైత్రా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలిమ మైత్ర అంగన్‌వాడీ యూనియన్ స్థాపించడంలో కీలక పాత్ర వహించారని తెలిపారు. అంతేగాకుండా ఆల్ ఇండియా కార్యదర్శిగా అధ్యక్షులుగా అనేక సంవత్సరాలు పని చేశారని తెలిపారు. నిరంతరం కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటాలు కొనసాగించారని కొనియాడారు. ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ వర్కింగ్ ఉమెన్ వ్యవస్థానలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. అనంతరం బృందాకరత్ ఉద్యమ జ్ఞాపకాల 'రీటా నేర్పిన పాఠం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ, మేరీ, కాత్యాయని, పాతక్క, విజయనిర్మల, సత్యవతి, గోవిందమ్మ, రమణమ్మ, రాధమ్మ, విజయనిర్మల, సత్యవతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ అన్నారు. శనివారం పట్టణంలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సంక్షేమం కూడా అరకొరగానే అందించారన్నారు. ఈ ఎన్నికలు చంద్రబాబు కోసం కాదని.. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు అన్నారు. నెలరోజుల్లో జరుగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అనురాధ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్‌ను ఆదరించాలని ఆయన సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు మహేంద్ర కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 17వ వార్డుల్లో ఆయా వార్డుల టిడిపి ఇన్‌ఛార్జిలు ఎస్ఎం బాషా, సరోజతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.రవితేజ, ఎన్.కేశవనాయుడు, ఎంకే.చౌదరి, పిల్లేల్లి కృష్ణయ్య, జక్కలచెరువు ప్రతాప్, కరిడికొండ సూరి, మాజీ కౌన్సిలర్ కె.గోవిందు, నబిరసూల్‌పాల్గొన్నారు.



టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

పామిడి : మండలంలోని ఓబులాపురం, ఖాదరపేట గ్రామాల్లో టిడిపి నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ కుమారుడు ఈశ్వర్ ఇంటింటికీ వెళ్లి టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వైసిపి దుష్టపాలన పోవాలంటే అందరం కలిసికట్టుగా పని చేయాలన్నారు. ముఖ్యంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలందరూ క్రియాశీలకంగా పని చేసి గుమ్మనూరు జయరామ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్యకర్త లక్ష్మీకాంతమ్మ, తెలుగుదేశం, బిజెపి, జనసేన కార్యకర్తలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు సైనికుల్లా పని చేయాలి : శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నాయకులు

పార్టీకి పట్టుకొమ్మలైన తెలుగుదేశం అభ్యర్థులకు గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడుతో కలిసి శనివారం మండల పరిధిలోని శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాలువ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఆయా గ్రామాల్లో పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి శ్రావణిశ్రీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అరాచకాలను ఎండగట్టాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిఎల్.ఈశ్వర్‌రెడ్డి, గుర్రప్పనాయుడు, అట్టే రామాంజనేయులు, డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, చిదంబరి దొర, గుత్తా ఆదినారాయణ, చిదానందనాయుడు, శాలిని, విశాలాక్షి, పెరవలి రాము, రాజు, జగ, చిన్న చౌడప్ప, అట్టే శ్రీనివాసులు, శంకరయ్య, కంబయ్య, ధనాంజి, బండి వెంకటరాముడు, లక్ష్మీనారాయణ, ఓబులేసు, చిన్నమట్లమంది పుల్లయ్య, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించడం 'బాబు' నైజం : 'అనంత'

ప్రజాశక్తి-అనంతపురం



మహిళతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ఎన్నికల ముందు హామీలు ఇచ్చి విస్మరించడం టిడిపి అధినేత చంద్రబాబు నైజం అని అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని 14వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు.. సీఎం అయ్యాక ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. చివరికి మేనిఫెస్టో కూడా కనిపించకుండా చేసిన ఘనుడు అని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో కూటమి కట్టిన నేతల మాటలు ఒక్కొక్కరివి ఒక్కో రకంగా ఉన్నాయన్నారు. ముస్లిములకు 4 శాతం రిజర్వేషన్‌పై బీజేపీ భిన్నవైఖరి అవలంభిస్తోందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. రాష్ట్రంలో మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ రాగే పరశురాం, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నర్సింహయ్య, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు మంజుల, అబూసాలెహా, చంద్రలేఖ, రాజేశ్వరి, జయలలిత, లావణ్య, సుజాత, చంద్రమోహన్, నరసింహులు, బాలాంజినేయులు, ఇషాక్, లక్ష్మీరెడ్డి, సుశీలమ్మ, ఉమామహేశ్వరి, సుగాలి పద్మావతి, రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, చింతా సోమశేఖర్‌రెడ్డి, సైపుల్లా బేగ్, మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, శ్రీనివాసులు, జాహ్నవి, వాసగిరి నాగ్, సాకే కుళ్లాయిస్వామి, వెన్నం శివారెడ్డి, చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, దాదా ఖలందర్, రాధాయాదవ్, విశాల, శోభబాయి, శోభారాణి, భారతి, సుభాషిణి, సుజాత, భానుమతి, ఉషా, ఉషారాణి, దేవి, ప్రమీల, సులోచన, పార్వతి, పద్మావతి, పద్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి రమణ టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు అనంత వెంకటరామిరెడ్డి స్వగృహంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఆయనతో పాటు అనంతపురం రూరల్ పంచాయతీ రామకృష్ణ కాలనీకి చెందిన విజయ్‌కుమార్, ఉదయ్ కుమార్, రాజేష్, పీరా, ఓబులేసు, సుబ్బారాయుడు తదితరులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు సుధాకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేతల కొత్త మార్గాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలొచ్చాయంటే ఎక్కడాలేని సందడి నెలకొంటుంది. ఇది వరకూ ఎన్నికలంటే ఆయా పార్టీల తరుపున నిలబడిన నేతలు ఇంటింటికెళ్లడం ఓట్లు అడగటం జరుగుతూ ఉండేది. వారు ఏం చేయదలచుకున్నారో వాటిని ప్రజలకు నేరుగా వివరించే ప్రయత్నం చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మరింది. అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానంతోపాటు, సమాచారాన్ని వినియోగించుకుని ఆన్‌లైన్‌లో ప్రజలకు వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు కొన్ని సంస్థలు కూడా పుట్టుకొచ్చాయి. ఆన్‌లైన్‌లో ప్రధానంగా మొబైల్ ఫోన్ ద్వారా ఓటర్లకు చేరవయ్యే పనిని చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొంత మంది సిబ్బంది ఆయా నియోజకవర్గాల్లో నియమించుకుని ఓటర్ల మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి తమ అభ్యర్థికి మద్దతునివ్వాలని కోరవడం ఒక పద్ధతి అయితే, ఆయా నియోజకవర్గాల్లో ఉండే ఓటర్లకు మాత్రమే సమాచారం వెళ్లేవిధంగా మరో ఏర్పాట్లు ఉన్నాయి. నియోజకవర్గాల పరిధిలోనున్న ఓటర్లందరికీ మొబైల్ ఫోన్ ద్వారా ఆయా అభ్యర్థిని గెలిపంచాలని కోరుతూ సమాచారం చేరుతూ ఉంటుంది. ఇక అంతేకాకుండా యూటూబ్, ఫేస్‌బుక్ వంటి సోషియల్ మీడియా ఫార్మాట్లలోనూ ఇదే రకమైన ప్రకటనలు వెలుతూ ఉంటాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో యూటూబ్ చూసే వారందరూ ఏదైనా యూటూబ్‌లో వీడియోలు చూస్తున్నప్పుడు తప్పకుండా ఈ ప్రకటన చూసే విధంగా ప్రకటన వస్తూ ఉంటుంది. ప్రకటన రూపొందించడం అది కనిపించే విధంగా చేయడానికి ప్రత్యేకమైన సంస్థలున్నాయి. ఇందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలుంటున్నాయి. ఇక పేస్‌బుక్ రీచ్ బట్టి ధర ఉన్న విషయం తెలిసిందే. సోషియల్ మీడియా ప్రచారం కోసం ప్రత్యేకమైన బృందాలను ఆయా అభ్యర్థులు ఏర్పాటు చేసుకుని తమతోపాటు వెంట ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇలా కొత్తకొత్త మార్గాల్లో ప్రచార ఏర్పాట్లను ఆయా పార్టీల నేతలు అవలంభిస్తున్నారు. మద్యం మాత్రం పాత పద్దతిలోనే పంపిణీని కొనసాగుతూనే ఉంది. ప్రచారాల సమయంలో వెంట వచ్చే నాయకులు, కార్యకర్తలకు విందు, మందు ఏర్పాట్లు కొనసాగుతూ ఉన్నారు. ఇక కొంత మంది అవుతే అభ్యర్థి తరుపున ప్రచారం చేయడానికి వాహనాలకు డిజిటల్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేసి, వాటిని గ్రామాల్లో సాయంత్రం సమయాల్లో ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. ఇలా వివిధ రూపాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాలను ముమ్మరం చేస్తుండటం గమనార్హం. ఇక వచ్చే వారంలో నోటిఫికేషన్ రాబోతోంది. ఆ తరువాత నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక ప్రచారం హడవుడి మరింత పెరిగే అవకాశాలున్నాయి. వీటన్నింటినీ ఎన్నికల సంఘం దృష్టి సారించింది. మీడియా, సోషియల్ మీడియాలో వస్తున్న ప్రచారాలపైనా దృష్టి పెట్టామని



చెబుతోంది. ఇక ఎన్నికల సంఘం కూడా ఆధునికమైన పద్ధతులను అవలంభించే ప్రక్రియను మొదలు పెట్టింది. వాహనాలకు జిపిఎస్‌లు అమర్చడం, వాటిని ట్రాక్ చేయడం వంటి వాటితో వెబ్ క్యాస్టింగులు వంటివి చేపడుతున్నారు. ఇప్పటికే ఇవిఎంలను ఆయా నియోజకవర్గ కేంద్రాలకు చేర్చే ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటికే పార్లమెంటు నియోజకవర్గాల ఇవిఎంలకే కేంద్రాలకు చేరగా, అసెంబ్లికి వచ్చే వారం రోజుల్లోపు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఈ ఎన్నికలు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కొత్త మార్గాల్లో సాగుతుండటం గమనార్హం.

మద్యం రవాణాపై గట్టి నిఘా : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లాలో అక్రమ మద్యం రవాణా జరగకుండా గట్టి నిఘా వేసి చర్యలు చేపట్టాలని ఎస్పీ అమిత్‌బర్దర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని సెబ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఆరంభం నుంచి జిల్లాలో సెబ్ విభాగం అధికారులు, బృందాలు చేసిన దాడులు, నమోదైన కేసులు, నిందితుల అరెస్టులు, బైండోవర్లు, ఎన్‌డిపిఎల్, డీపీఎల్ సీజర్స్, నాటుసారా స్వాధీనంపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా జరగాలంటే అక్రమ మద్యం కట్టడి కీలకమన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం జిల్లా సరిహద్దుల్లోకి రాకుండా గట్టి నిఘా వేయాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించడంతో పాటు జిల్లాలోకి ప్రవేశించే ప్రత్యామ్నాయ మార్గాలు, అడ్డదారులు, బండిజాడలు, కాలినడక దారులపై నిఘా వేయాలన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వజ్రకరూరు : వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం వైద్యాధికారి పీవీ అనికేత్ సూచించారు. శనివారం మండలంలోని పెద్దకౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నింబగల్ ఎస్సీ కాలనీలో డాక్టర్ పివి అనికేత ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు సరిగా తీసుకోకపోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి, నీటి శాతం తగ్గిపోవడం వల్ల వడదెబ్బకు గురవుతారన్నారు. తద్వారా తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, శరీర ఉగ్రత పెరగడం, నీరసంగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వెంటనే వడదెబ్బగా భావించి సకాలంలో చికిత్స చేయించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎండలో తిరగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగరత్న, ఆరోగ్య సహాయకులు ప్రసాద్‌రావు, ఎఎన్ఎం నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

108లోనే ప్రసవం

నార్పల : శింగనమల మండలం నాయనాపల్లి క్రాస్‌కు చెందిన గర్భిణీ 108 వాహనంలోనే ప్రసవం అయింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. నాయనపల్లి క్రాసింగ్‌కు చెందిన గర్భిణీ మనీషాకు తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణీని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గంమధ్యలోనే కానుపు అయింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది ఇఎన్‌టి అనిల్‌కుమార్, పైలెట్ రాజేష్ తెలిపారు. దీంతో 108 సిబ్బందికి మనీషా కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల విధులపై అవగాహన

హిందూపురం : ఎన్నికల విధులపై ప్రతి పోలీసు అవగాహన కల్గి ఉండాలని డిఎస్‌పిలు కంజాక్షన్, శ్రీనివాస రావు అన్నారు. శనివారం పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాల్ లో ఎలక్షన్ సెల్ పోలీస్ సిబ్బందికి, మహిళా పోలీసులకు ఎన్నికల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండీ ముగిసే వరకు పోలీసుల పాత్ర- విధులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికలలో అక్రమాలకు అడ్డుకట్ట, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై డీఎస్పీలు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు రియాజ్ అహ్మద్, శ్రీనివాసులు, ఈరన్న, శ్రీనివాసులు, హిందూపురం సబ్ డివిజన్ ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

హిందూపురం : ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పట్టణ సిఐ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు కవాతు కవాతును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలతో పాటు పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అభిమానుల ఎన్నికల ప్రచారం

ముదిగుబ్బ : మండలంలోని 10 గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో గోనుగుంట్ల సూర్యనారాయణను గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, దేవేంద్ర నాథ్ రెడ్డి, , రెడ్డప్ప, లక్ష్మీనారాయణ, జయకృష్ణ, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 21 నెలలకు సంబంధించి ప్రభుత్వం పిఆర్సీ బకాయిలను చెల్లించలేదన్నారు. డిఎ బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వహించిందన్నారు. కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు జీవన భృతి కల్పించలేదన్నారు. వారికి రావాల్సిన నగదును చెల్లించకుండా మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను రోడ్డున పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి నాయకులు పెన్షనర్లను కలిసి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని సమస్యలను పరిష్కరిస్తామని హామీని ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరాం, ఎంపీగా అంబిక లక్ష్మీనారాయణను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షన్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి కె.రామ్మోహన్, కోశాధికారి ఫక్రుద్దీన్, పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

వజ్రకరూరు : మండలంలోని మోపిడిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్‌సింహా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈనేపథ్యంలో అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా టిడిపిని గెలిపించుకుని చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న విక్రమ్‌సింహా

రసవత్తరంగా చిలమత్తూరు రాజకీయాలు

చేరికల్లో పోటీపడుతున్న ఇరుపార్టీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ప్రత్యర్థి పార్టీల నాయకులను పార్టీలోకి చేర్పించుకోవటంలో టిడిపి, వైసిపిలు పోటీ పడుతున్నాయి. శుక్రవారం రాత్రి మేజర్ పంచాయతీ సర్పంచి సంధ్య టిడిపి కండువా కప్పుకున్నారు. ఆ తరువాత శనివారం వైసిపి కార్యాలయంలో వైసిపి కండువా వేసుకొని తనను స్వంత పార్టీ నాయకులే ప్రలోభ పెట్టి టీడిపి కండువ వేశారని వ్యాఖ్యానించారు. వైఎస్ ఎంపిపి బయప్ప కొడుకు శ్రీనివాసులు,మరసలపల్లి ఎంపిటీసి కొండప్ప, చిలమత్తూరు - 2 ఎంపిటీసి నాగమణి భర్త నాగరాజు, వార్డు మెంబర్లు చౌడప్ప, షామీర్, రౌనకుల్లా తదితరులు టీడీపి పార్టీలో చేరారు. ఇక టిడిపి నుండి ఆ పార్టీ మాజీ మండల కన్వీనర్ బాబురెడ్డి వైసిపి అభ్యర్థి దీపిక ఆధ్వర్యంలో అన్సర్ సమక్షంలో వైసిపిలో చేరారు. ఇదిలా ఉండగా చాగలేరు పంచాయతీలో వైసిపి అభ్యర్థి దీపిక ప్రచారం నిర్వహించారు.

హిందూపురం అభివృద్ధి కోసం నిరాహార దీక్ష

వైసిపి నేత బెల్లం నరేష్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్ఆర్ విగ్రహం ముందు నిరాహార దీక్షా చేపడుతున్నట్లు వైసిపి నేత బెల్లం నరేష్ తెలియజేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూపురం ప్రాంత అభివృద్ధి జరగాలంటే మంచి మనసున్న నాయకుడు అవసరం అన్నారు. ఆలాంటి మంచి మనసున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హిందూపురం నుంచి పోటీ చేయాలని లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. హిందూపురం ప్రాంత అభివృద్ధిపై వైసిపితో పాటు బాలకృష్ణ, ఇతర పార్టీ అభ్యర్థులు సోమవారం లోపు హామీ ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలన్నారు. లేని పక్షంలో తాను హిందూపురం ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్ విగ్రహం ముందు నిరాహార దీక్ష చేపడతానన్నారు.

ఐదేళ్లలో 2,39,619 శాశ్వత ఉద్యోగాలు

వైసిపి ఐటి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-పామిడి

సిఎం జగన్ అయిన తర్వాత రాష్ట్రంలో 2,39,619 ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు వైసిపి ఐటి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1.30లక్ష సచివాలయ ఉద్యోగాలు, 65 వేల మెడికల్ స్టాఫ్‌నర్సు, డాక్టర్ల ఉద్యోగాలు, 20వేల పాత, కొత్త డీఎస్సీ ఉద్యోగాలు కల్పించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలోని ఇన్ని ప్రభుత్వ ఉద్యోగాను ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వీటితోపాటు చిన్న పరిశ్రమలు ప్రోత్సాహకాల ద్వారా లక్షల ప్రయివేటు ఉద్యోగాలు కల్పించారన్నారు. 2014-2019 మధ్యకాలంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం 34,780 మాత్రమే అన్నారు. కేవలం రాజకీయం కోసమే టిడిపి నాయకులు ఉద్యోగాలు కల్పించడం లేదని అవాస్తవాలు చెబుతున్నారన్నారు. వాటి మాటలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఐటీ నాయకులు హరినాథ్‌రెడ్డి, వినోద్‌కుమార్, నాగేష్, శివ, శావలి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి ఐటి జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి

గౌరవవేతనం విడుదలపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలోని మసీదుల్లో ఉన్న మౌజన్, ఇమామ్‌లకు గౌరవ వేతనం విడుదల చేయడంపై గుత్తి ఆర్ఎస్ సున్నీరోషన్ మసీదు కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ బజార్‌లో ఉన్న సున్నీరోషన్ మసీదులో మసీదు కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నీ రోషన్ మసీదు కమిటీ కార్యదర్శి నబి రసూల్, సభ్యులు జబ్బార్, జిఎం బాషా మాట్లాడుతు మౌజాన్లు, ఇమామ్‌లకు ఆరు నెలలకు సంబంధించి గౌరవ వేతనాన్ని విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్, వక్ఫ్ బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్ మునాఫ్, అబ్దుల్ జిలాన్, అక్బర్, ఇమామ్ కరీముల్లా, మాజన్ జిలాన్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మౌజన్, ఇమామ్‌లు

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని పాత ఊరు, గుడ్డం పల్లి తండా ప్రజలు అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గుంజేపల్లి విద్యుత్ ఫీడర్ లోని పాత ఊరు, గుడ్డంపల్లి తండాలో శనివారం ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ కోత ఏర్పడిందని వినియోగదారులు వాపోయారు. వేసవికాలం కావడంతో ఉక్కపోతతో చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు తడి అందక రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ విషయంపై కదిరి ఎడిఇ బాలసుబ్రమణ్యం ను వివరణ కోరగా గుంజే పల్లి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా పాత ఊరు, గుడ్డంపల్లి తండా లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని చెప్పారు.

శ్రీ చైతన్య విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ నేషనల్ సెర్చ్ ఒలింపియాడ్ రెండవ లెవల్ వెలువడిన ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య ఎటిపి-8 పాఠశాల విద్యార్థులకు ఎజిఎం సుబ్బారెడ్డి శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అనంతపురం ఎటిపి-8 బ్రాంచికి చెందిన ఎం.చరితార్థ్‌రెడ్డి, రెండవ బహుమతి, ఎన్.సభిహాసుల్తానా మూడవ బహుమతి, ఎస్.జతిన్ ఐదవ బహుమతి, డి.కావ్యశ్రీ ఐదవ బహుమతి, అరిక్ రాయ్ మూడవ బహుమతి, అద్రిక రాయ్ నాల్గవ బహుమతి, ఆద్యవైభవి, బి.హన్విక, అద్విక పాయల్, ఓ.అంకితలు స్పెషల్ బహుమతులు పొందారన్నారు. ఏటిపి-8 పరిధిలో 73 మంది విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఎటిపి-8 ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్ రెడ్డి, డీన్ అరుణ్ కిరణ్, సి బ్యాచ్ డీన్ గంగాధర్, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రైమరీ ఇన్‌ఛార్జి దేవకృప, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి రషీదా పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి



ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
ఆదివారం 14 ఏప్రిల్ 2024



పుట్టపర్తి ముఖచిత్రం

అధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు తెచ్చుకున్న పుట్టపర్తి, రాజకీయంగానూ అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. 2009కి పూర్వం వరకు కేవలం మండల కేంద్రంగానే ఉన్న పుట్టపర్తి ఆ తరువాత పుట్టపర్తి నియోజకవర్గ కేంద్రంగా రూపాంతరం చెందింది. గోరంట్ల నియోజకవర్గంలో ఉన్న పుట్టపర్తిని దాని నుంచి విడదీసి నల్లమాడ స్థానంలో నియోజకవర్గంగా మార్చారు. ఇప్పటి వరకు ఈ నియోజక వర్గానికి రెండు సార్లు ఎన్నికలు జరిగాయి. అంతకు మునుపు ఈ నియోజకవర్గం పరిధిలోని మండలాలు గోరంట్ల, నల్లమాడ నియోజకవర్గంలో ఉండేవి. జిల్లాలో అతి పెద్ద నియోజకవర్గంగా పుట్టపర్తికి గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం నుంచి పలువురు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రులుగా పని చేశారు. అగిశం వీరప్ప నుంచి పల్లె రఘునాథరెడ్డి వరకు పలువురు క్యాబినెట్ మంత్రులుగా పని చేశారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గాల కలయిక పుట్టపర్తి

గోరంట్ల, నల్లమాడ నుంచి పుట్టపర్తి ఏర్పాటు

ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు

మంత్రులుగా పలువురి ప్రాతినిధ్యం

2009లో పుట్టపర్తి నియోజకవర్గంగా ఏర్పడడంతో నల్లమాడ, గోరంట్ల కేంద్రాలు తొలగిపోయాయి. గోరంట్ల పెనుకొండ నియోజకవర్గంలో చేరగా, నల్లమాడ పుట్టపర్తి నియోజకవర్గంలో చేరింది. నూతనంగా ఏర్పడిన పుట్టపర్తి నియోజకవర్గంలో 2009, 2014 ఎన్నికల్లో రెండు సార్లు టిడిపి అభ్యర్థి పల్లె రఘునాథరెడ్డి గెలుపొందారు. 2014లో ఈయన మంత్రిగానూ, తర్వాత చీఫ్‌విప్‌గానూ పని చేశారు. ఇక నల్లమాడ నియోజకవర్గం నుంచి 1999లో ఒక సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2007 నుంచి 2009 వరకు ఎమ్మెల్సీగానూ పనిచేశారు. 1995 గోరంట్ల ఉప ఎన్నికల్లో నిమ్మల కిష్టప్ప విజయం సాధించారు. 1996 నుంచి 1999 వరకు ఈయన మంత్రిగా పనిచేశారు. రెండవ సారి విజయం సాధించి 1999నుంచి 2004వరకు మంత్రిగా పనిచేశారు. 2004లో ఓటమి చెందారు. నల్లమాడ నియోజకవర్గం నుంచి నల్లశింగయ్యగారిపల్లికి చెందిన అగిశం వీరప్ప 1972లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1974నుంచి 78 వరకు చీఫ్‌విప్‌గా పనిచేశారు. 1978లో రెండవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి, 1983 వరకు మంత్రిగా పనిచేశారు. 1983లో ఓడి పోయారు. 1989లో నల్లమాడ నుంచి మూడవ సారి ఎమ్మెల్యేగా అగిశం గెలుపొంది సభాహక్కుల కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. అగిశం తర్వాత ఆ స్థాయిలో పదవులను చేపట్టిన వ్యక్తి పల్లె రఘునాథరెడ్డి అని చెప్పాలి. ఈయన మంత్రిగా, చీఫ్‌విప్, ఎమ్మెల్సీగా ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు.

పల్లె, అగిశం మూడు సార్లు ఎన్నిక


నల్లమాడ, పుట్టపర్తి నియోజకవర్గాల నుంచి పల్లె రఘునాథరెడ్డి, అగిశం వీరప్ప మూడు సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిద్దరూ మంత్రులుగానూ పని చేశారు. పల్లె రఘునాథరెడ్డి చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో పని చేయగా, అగిశం వీరప్ప చెన్నారెడ్డి, అంజయ్య, భవనం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. వీరి తర్వాత కె.రామ చంద్రారెడ్డి రెండు సార్లు నల్లమాడ నుంచి ఎమ్మెల్యేగా గెలు పొందారు. ఈయన ఒక సారి హిందూపురం పార్లమెంట్ నుంచి ఎంపీగానూ గెలుపొందారు.



అగిశం వీరప్ప




పల్లె రఘునాథరెడ్డి



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ, పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు

సం॥	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1955	బయ్యపురెడ్డి	కాంగ్రెస్	ఎన్ఎన్.రెడ్డి	సిపిఐ
1962	వై.పాపిరెడ్డి	ఇండి	కెవి.వేమారెడ్డి	కాంగ్రెస్
1967	కె.రామచంద్రారెడ్డి	కాంగ్రెస్	టి.లక్ష్మినారాయణరెడ్డి	సిపిఎం
1972	అగిశం వీరప్ప	కాంగ్రెస్	కె.రామచంద్రారెడ్డి	ఇండి
1978	అగిశం వీరప్ప	కాంగ్రెస్–ఐ	కె.రామచంద్రారెడ్డి	జనతా
1983	కె.రామచంద్రారెడ్డి	టిడిపి	అగిశం వీరప్ప	కాంగ్రెస్
1985	సద్దెపల్లి వెంకటరెడ్డి	టిడిపి	అగిశం వీరప్ప	కాంగ్రెస్
1989	అగిశం వీరప్ప	కాంగ్రెస్	సద్దెపల్లి వెంకటరెడ్డి	టిడిపి
1994	టిడి.నాగరాజురెడ్డి	టిడిపి	అగిశం వీరప్ప	కాంగ్రెస్
1999	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి	కె.మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2004	కె.మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి
పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పాటు తర్వాత				
2009	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి	కె.మోహన్‌రెడ్డి	కాంగ్రెస్
2014	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి	సి.సోమశేఖర్‌రెడ్డి	వైసిపి
2019	దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి	వైసిపి	పల్లె రఘునాథరెడ్డి	టిడిపి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

'సుధాకర్‌ను ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి 'సుధాకర్‌ను ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపి స్తాం' అని సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి తెలిపారు. ఆయన శనివారం రొళ్ల మండలంలోని ఎం.రాయపురం, ఎంఆర్.గొల్లహట్టి, సోమగట్ట, చిగమతిగట్ట, బద్రేపల్లి, హులికుంటే, దొమ్మరహట్టి, ఆర్.గొల్లహట్టి, రొళ్లకొండ. ఆర్.వద్రహట్టి, హనుమంతనపల్లి, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘువీరారెడ్డి మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి గతంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం, గతంలో టిడిపి సర్కార్ మడకశిర అభివృద్ధిని విస్మరించాయని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా నాకున్న పరిచయాలతో నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రతి ఇంటికీ శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయి, రేకులకుంట గ్రామ సమీపంలో సేకరించిన 1600 ఎకరాల భూమిలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని 320 చెరువులకు నీరు, రైల్వే లైన్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని ఎం.ఆర్.గొల్లహట్టి గ్రామంలో వైసిపికి చెందిన దాసప్ప, చిక్క కరియన్న, కృష్ణప్ప, రాజన్న, పూజారి చిక్కన్న, నాగరాజు, బోడ చిక్కప్ప, శివన్న, చిగమతిగట్ట, గొల్లహట్టి గ్రామంలో టిడిపి నుంచి రాజన్న, చిత్తప్ప, బద్రేపల్లి గొల్లహట్టి గ్రామంలో వైసిపి నుంచి వార్డ్ మెంబర్ మాలింగప్ప, ఆర్.గొల్లహట్టి గ్రామంలో టిడిపి నుంచి శివన్న, గోవిందప్ప కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఎన్నికల ప్రచారం

పరిగి : టిడిపి అభ్యర్థి సవితమ్మ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆపార్టీ నాయకులు నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం పరిగి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని సీతారాంపురం అంబేద్కర్ నగర్ బోరెడ్డిపల్లి కాలనీలలో ప్రచారం నిర్వహించారు. నాన్ లోకల్ అభ్యర్థులను ఇంటికి పంపి స్థానికులకు అవకాశం కల్పించాలని వారు కోరారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాలాజీ, సూర్యనారాయణ, సత్యనారాయణ, హనుమయ్య, చౌడప్ప, వెంకటేష్, కన్నప్ప, మారుతి, డిఎస్ఎల్ శ్రీనివాసులు, నాగభూషణం, నీరుగంటి నరసింహప్ప, కుమార్ మోద రవి, వడ్డెర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బాలయ్యను ఆదరించండి..



ఎన్నికల ప్రచారంలో నందమూరి వసుంధరదేవి, తదితరులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

హిందూపురం నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన బాలయ్య ముచ్చటగా మూడో సారి విజయకేతనం ఎగరవేసేలా ఆదరించాలని బాలక్రిష్ణ సతీమణి వసుంధర దేవి అన్నారు. ఈ మేరకు ఆమె సోమగట్ట పంచాయతీలో శనివారం హిందూపురం నియోజకవర్గం అభ్యర్థి బాలక్రిష్ణ, పార్లమెంటు అభ్యర్థి పార్థ సారధికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమం లో బాలక్రిష్ణ సోదరి లోకేశ్వరి, అల్లుడు భరత్, ఐటి వింగ్ అధ్యక్షురాలు తేజశ్విని పాల్గొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గాన్ని తన సొంత నిధులతో బాలక్రిష్ణ అభివృద్ధి చేశారని అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథం పేరిట ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్నారని చెప్పారు. అలాగే గ్రామీణ రోడ్లు, నీటి సమస్యను బాలక్రిష్ణ పరిష్కరించారని అన్నారు. బాలక్రిష్ణను మూడో ఆదరించి నియోజక వర్గం మరింత అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్థానిక టీడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం శాసన సభ్యుడిగా మూడో సారి పోటీ చేస్తున్న నందమూరి బాలక్రిష్ణను ప్రజలు ఆదరించాలని నందమూరి వసుంధర కోరారు. ఈ మేరకు ఆమె శనివారం బాలయ్యకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సూగూరు ఆంజినేయ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లపల్లిలో వైసీపీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని బండ్లపల్లి ,విరుపాపురం గ్రామాలలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి బామ్మర్ది రాఘవరెడ్డి, ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్ మోహన్ రెడ్డి, మండల పరిశీలకుడు అవుతాల రమణారెడ్డి, జడ్పిటిసి గంగాదేవి శంకర్, గ్రామ సర్పంచి గీతాబాయి, కో ఆప్షన్ నెంబర్ మున్వార్ భాష, వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, నాగభూషణ, నాగరాజు, బళ్లారి బాబు, సంజీవరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : పల్లె



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి



పుట్టపర్తిలో నిర్వహించిన భారీ బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, టిడిపి పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి సింధూర రెడ్డి అన్నారు. పుట్టపర్తికి చెందిన రామ్ లక్ష్మణులు తమ మద్దతుదారులతో కలసి వైసీపీ నుండి టిడిపిలోకి శనివారం చేరారు. ఈసందర్భంగా కర్నాటక నాగేపల్లి బుక్కపట్నం మీదుగా కొత్తచెరువు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు పూర్తిగా విసుగు చెందారన్నారు. టిడిపి రూపొందించిన ఆరు గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లెకృష్ణ కిషోర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు,జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, మండల కన్వీనర్ రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, టిడిపి నాయకులు గాజుల చంద్రమోహన్, బోయ రాజు, రామాంజనేయులు, వైవి మురళి, రిటైర్డ్ టీచర్ నాగేందర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భారీ బైక్‌ర్యాలీ

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో యూత్ నాయకులు రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో 5వేల మంది వైసిపి పార్టీ నుంచి టిడిపిలో శనివారం చేరారు. ఈ సందర్భంగా 3వేల ద్విచక్రవాహనాలు, వెయ్యి ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గోకులం ఇన్‌చార్జ్ భూమిగాని రాజశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో వెయ్యి బైకులతో అలాగే 13వ వార్డు కోవెలగుట్టపల్లి టిడిపి మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వెయ్యి బైకులతో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి నుంచి ప్రారంభమై జానకంపల్లి, బుక్కపట్నం, కొత్తచెరువు, మామిళ్ళకుంట క్రాస్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బ్రాహ్మణపల్లి, ఎనుములపల్లి, గోకులం మీదుగా మూడు మండలాలు కలుపుతూ దాదాపు 20 కిలోమీటర్లు తిరిగి పుట్టపర్తి లోని సత్యమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రామ్ లక్ష్మణ్‌లు తన అనుచరులు, అభిమానులతో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కన్పించని అభివృద్ధి : పల్లె

ఓబుళదేవర చెరువు : వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి అటకెక్కిందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. మండలంలోని తుమ్మలకుంట్లపల్లి గ్రామపంచాయతీ వైసీపీ సర్పంచి వేలమద్ది శ్రీదేవి ,రవీంద్రనాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన వాలంటీర్లు తోపాటు 150 కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో ఎంతో మేలు చేకూరుతుందని భావించామన్నారు. అలాగే పుట్టపర్తి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతోనే అభివృద్ధి జరుగుతుందని భావించి టిడిపిలోకి చేరినట్లు సర్పంచి శ్రీదేవి, వైసీపీ నేత రవీందర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. టిడిపిలో చేరిన వారిలో లక్ష్మీనరసింనాయుడు, సుధాకర్ నాయుడు, బుట్టి రాము ,మనోరంజని, వేలమద్ది చిన్న రంగప్ప ,రాజప్ప, ఎర్రమనేని చంద్ర, బీరేఅశోక్, ఎర్రమనేని చంద్రమౌళి, ఉషారాణి ,సాంబమూర్తి, నారే వెంకటేశు, నారే శివశంకర్ , యర్రమనేని శంకర, ఎర్రమనేని సురేష్ ,ఈశ్వరయ్య ,నాగముని ,నాగమునిమ్మ జయమ్మ ,శాంతమ్మ రాజేంద్ర, బాబు, పటాన్ మహబూబ్ బాషా తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి కన్వీనర్ జయచంద్ర , మాజీ జడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, మహబూబ్ భాష, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచి శంకర్ రెడ్డి, రేణుక భాయ్, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, , ఆరిఫ్ ఖాన్, చాంద్ భాషా, షబ్బీర్ జాకీర్ అహ్మద్, ఇర్షాద్ షాను ,నిజాం, ఓబుల్ రెడ్డి, బోయపల్లి శివారెడ్డి, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

పల్లె ఆధ్వర్యంలో టిడిపిలో పలువురు చేరిక

కొత్తచెరువు రూరల్: కొత్తచెరువు మండల పరిధిలోని పోతులకుంట గ్రామానికి చెందిన పలువురు పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై ఈ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు వారికి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎవ్వరికైనా సముచిత న్యాయం లభిస్తుందని అన్నారు.

పుట్టపర్తిలో బాలకృష్ణకు ఘనస్వాగతం



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలక్రిష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణకు పుట్టపర్తి మండలం మామిళ్ళ కుంట వద్ద టిడిపి శ్రేణులు, నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కదిరి నుండి నేరుగా మామిళ్లకుంట క్రాస్‌కు చేరుకున్న బాలకృష్ణ అక్కడ ఏర్పాటుచేసిన రథంపై నుంచి అభిమానులకు నాయకులకు అభివాదం చేశారు. మామిళ్ళకుంట క్రాస్ నందు ఆయనకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర వెంకట కృష్ణ కిషోర్ , పత్తి చంద్రశేఖర్, కొండమ రాజు, లాయర్ హరికృష్ణ, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కొత్తచెరువులో జరిగే బహిరంగ సభకు బయలుదేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల నాయకులు సామకోటి ఆదినారాయణ. మాజీ సర్పంచి చంద్రశేఖర్, శ్రీరామ్ రెడ్డి, పుళ్ళప్ప, విశ్వనాథ్, ప్రసాద్, మాజీ సర్పంచ్ కేశవ, పెడపల్లి రంగప్పా, వేలాదిమంది బాలకృష్ణ అభిమానులు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైసిపిలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11, 30వార్డుల నుంచి 105 టీడీపీ కుటుంబాలు వైసిపిలో చేరాయి. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి వైసిపిలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల రూపంలో డబ్బులు వేస్తుంటే చంద్రబాబునాయుడు మాత్రం డబ్బులు ఇలా వేస్తే మరో శ్రీలంక అవుతుందని అన్నారని చెప్పారు. కాని ఈరోజు అంతకన్నా ఎక్కువ ఇస్తామని అంటున్నాడని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని చెప్పారు. జెండాలు కలపడం కాదని జనం గుండెల్లో నిలవాలని వ్యాఖ్యానించారు. చంద్రబాబునాయుడు మూడుసార్లు ముఖ్యమంత్రి అయినా ఏరోజు ప్రజల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో 11వవార్డు కౌన్సిలర్ అత్తర్ జిలాల్బాష, 30వవార్డు కౌన్సిలర్ రమాదేవి, వైసిపి పట్టణాధ్యక్షులుకోటిరెడ్డి బాలిరెడ్డి, వైయస్సార్ విద్యార్థివిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అమర్నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తం రెడ్డి. నాయకులు బడన్నపల్లి కేశవరెడ్డి, కుండా మీనాక్షయ్య, తీర్థాల రమణ, కత్తి పెద్దన్న, చెలిమి పెద్దన్న, ఉడుముల రాము, ట్రైముతక రమణ, స్టోర్ డీలర్ల సంఘం రాష్ట్ర నాయకులు పరంధామరెడ్డి, సభ్యులు వెంకటరమణ, అంకె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనపార్టీలో చేరిక

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ధర్మవరానికి చెందిన భాస్కర్ తిరుపతిలో శనివారం జరిగిన కార్యక్రమంలో జనసేనలో పార్టీలో చేరారు. అరిగెలభాస్కర్ గతంలోకూడా ప్రజారాజ్యం పార్టీలో కొనసాగారు. అనంతరం జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. అయితే కొన్ని కారణాల వల్ల పార్టీలో దూరంగా ఉంటూ వచ్చారు.దీంతో ప్రస్తుతం తిరుపతిలో పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరగా ఆయనకు ఫవన్ కల్యాణ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి జనసేన పార్టీ నాయకులతో కలిసి కృషిచేయాలని పవన్ కల్యాణ్ సూచించినట్టు అరిగెల భాస్కర్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడు రాజీనామా

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ వీరనారాయణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1987 నుంచి 2012 వరకు పార్టీలో వివిధ పదవులు పొంది పార్టీకి తగిన సేవలందించామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగానూ 2012లో ఉమ్మడి జిల్లా సేవాదళ్ అధ్యక్షునిగాను పనిచేశామన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసినట్లు వివరించారు. అయితే పార్టీలో తగిన గుర్తింపు లేనందున పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే తనకార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

వైసీపీతోనే పేద, బడుగు వర్గాల అభివృద్ధి

ప్రజాశక్తి-హిందూపురం

వైసీపీ ప్రభుత్వంతోనే పేద బడుగు వర్గాలకు ఆత్మ గౌరవం దక్కిందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక అన్నారు. శనివారం హిందూపురం రూరల్ మండలం మణే సముద్రం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 10 సంవత్సరాలుగా ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న బాలక్రిష్ణ చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. తెలంగాణలో ఉన్న వ్యక్తిని కాకుండా స్థానికంగా ఉన్నా తమను వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 7.22 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని చీకటిమాని పల్లి వద్ద పోలీసులు ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ లో శనివారం చేపట్టిన తనిఖీల్లో పోలీసులు రూ. 7. 22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లి నుండి ఓడిసికి వెళ్తున్న మూడు వాహనాలను తనిఖీ చేస్తుండగా అందులో ఎటువంటి ఆధారాలు లేని రూ.7.22 లక్షల నగదును గుర్తించిన పోలీసులు సీజ్ చేశారు. పట్టుబడిన వడ్డే శ్రీనివాసులు వద్ద లక్ష రూపాయలు, కనికేటి శుభహాన్ వద్ద రూ.91,800, మల్లెం గంగన్న వద్ద లక్ష రూపాయలు, ఎర్రమనేని రమణప్ప వద్ద లక్ష రూపాయలు, కాలువ హనుమంతు రెడ్డి వద్ద రూ.90వేలు, వడ్డే లక్ష్మీనారాయణ వద్ద నుంచి రూ.2.41 లక్షలు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ ధరణిబాబు తెలిపారు.వీరందరూ వివిధ వాహనాలలో వెళుతున్నట్లు ఆయన చెప్పారు.